నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, ఆదివారం 11 మే 2025 | MEDAK

జవాన్ల త్యాగం వెలకట్టలేనిది


వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హరీశ్ రావు

- వీర జవాన్‌కు హరీశ్‌రావు నివాళి

సిద్దిపేట, మే 10: పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ పోరాటం, త్యాగం ఎంతో గొప్పదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ రక్షణకు ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారన్నారు. దేశం కోసం వారు చేసిన త్యాగం గొప్పదని, ఈ యుద్ధంలో భారత్ గొప్ప విజయం సాధిస్తుందని హరీశ్‌రావు ఆకాంక్షించారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండి దేశ రక్షణ కోసం ప్రాణాలొడ్డి పోరాడుతున్న సైనికులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల సాయిరామ్, నాయకులు రాగుల సారయ్య, కాముని శ్రీనివాస్, ఎల్లారెడ్డి, మెరుగు మహేశ్, ప్రభాకర్ రెడ్డి, భిక్షపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యం పోరాటం అద్భుతం

- మాజీ మంత్రి హరీశ్‌రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 10: ఉగ్రవాదాన్ని అంతం చేసి దేశంలో శాంతి నెలకొల్పాలని దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మొదటిసారి సిద్దిపేటలో చేస్తున్న 108 హోమ కుండలాల హనుమాన్ యజ్ఞం ఫలించాలని కోరుకుంటున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. శనివారం సిద్దిపేటలోని సంతోషిమాత ఆలయంలో దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో 108 కుండలాలతో హనుమాన్ యజ్ఞాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొని దుర్గాప్రసాద్ స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌లో ఉగ్రవాదులను ఏరివేయడానికి భారత సైన్యం అద్భుతమైన పోరాటం చేస్తున్నదని కొనియాడారు. పహల్గాంలో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం కలిచి వేసిందన్నారు. దేశం సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ యజ్ఞం మన సైనికులకు మరింత బలాన్ని చేకూర్చి ఉగ్రవాదంపై విజయం సాధించాలని భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు. యువత భక్తి మార్గంలో నడవడానికి, క్రమశిక్షణతో మెలిగేందుకు హనుమాన్ దీక్ష ఎంత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కాళేశ్వరం జలాలతో కోమటి చెరువు నింపి ఏటా తెప్పోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు తెప్పోత్సవం అంటే విజయవాడలో, ఇంకా ఎక్కడనో చూసేవారమన్నారు. ఈసారి అద్భుతంగా తెప్పోత్సవం నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బచ్చు రమేశ్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి తేవాలి

నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, మే 10: జూలై నాటికి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని అందుబాటులోకి తేవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. జిల్లాలో సాగుచేసిన ఆయిల్‌పామ్ పంట చేతికి వచ్చిందని, జూలై నాటికి ఫ్యాక్టరీ అందుబాటులోకి తేవాలన్నారు. ఏటా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు రైతులు ఎంతో కష్టపడి చేస్తున్నారని, రైతులకు మేలు చేసే ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయిల్‌ఫెడ్ కమిషనర్‌తో హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడారు. ఆయిల్ రిఫైనరీ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, కోల రమేశ్ గౌడ్, నాయకులు ఉన్నారు.

ధనసిరి.. దేశసేవకు సై

గ్రామం నుంచి వంద మంది వరకు ఆర్మీలో సేవలు

- అనేక గ్రామాలకు ఆదర్శం
- దేశంపై ప్రేమతో సైన్యంలో చేరిక

తెరస్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్న గుంజోట్టికి చెందిన శివకుమార్

అమృత్‌సర్‌లో విధులు నిర్వహిస్తున్న బర్ధిపూర్‌కు చెందిన ప్రశాంత్

జహీరాబాద్, మే 10: సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామ బిడ్డలు దేశసేవలో తరిస్తున్నారు. ఈ గ్రామం నుంచి సుమారు వంద మంది వరకు దేశ త్రివిధ దళాల్లో పనిచేస్తూ దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ఒకరి నుంచి ఒకరు స్ఫూర్తి పొందిన ఈ గ్రామయువత ఆర్మీలో చేరుతున్నారు. కమాండర్, బ్రిగేడియర్, హవాల్దార్, ఆర్మీ వైద్యాధికారులు, ఫిజికల్ ట్రైనర్, లాస్ నాయక్, నాయక్ సుబేదార్, సుబేదార్, సైనికులుగా గ్రామ యువత సేవలు అందిస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాల నుంచి మరో వందమందికి పైగా సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్నారు. దేశ సరిహద్దుల్లో కాపలా దారుడిగా పనిచేసే భాగ్యం కలగడం అదృష్టం, ఆ అదృష్టం ఎందరికో రాదు, చావు ఎప్పటికీ తప్పదు, దేశం కోసం ప్రాణాలర్పిస్తే ఆ తృప్తి వేరు అంటూ జహీరాబాద్ ప్రాంత యువత ఆర్మీలో చేరి దేశ సేవలో నిమగ్నమయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారు. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్, న్యాల్‌కల్, తాట్‌పల్లి, మల్కాన్‌పాడ్, గుంజోట్టి, మిర్జాపూర్ (ఎన్), ఝరాసంగం మండలంలోని ఎల్గొయి, పోట్‌పల్లి, బర్ధీపూర్ గ్రామాలకు చెందిన యువకులు సైన్యంతో పాటు బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లోనూ జహీరాబాద్ సైనికులు పాల్గొని శత్రుదేశం పాకిస్థాన్ దాడులను తిప్పికొట్టారు.

దేశ రక్షణకే ఈ జీవితం..

నేను సైన్యంలో చేరి ఆరేండ్లు అవుతున్నది. చిన్ననాటి నుంచే దేశసేవ చేయాలన్నదే నా లక్ష్యం. తల్లిదండ్రులు, కుటుంబీకులు, స్నేహితుల ప్రోత్సాహంతో ఆర్మీలో చేరాను. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఉన్నతాధికారుల నుంచి పిలుపు వచ్చింది. ఆర్మీలో నేను అనేక ప్రాంతాల్లో పనిచేశాను. ఆర్మీలో ఉద్యోగం చేస్తుంటే తృప్తిగా ఉంది. – సీహెచ్ నవీన్‌కుమార్, సైనికుడు, హద్నూర్ (న్యాల్‌కల్ మండలం)

కాంటా చేయడం లేదని రైతుల ఆవేదన

మ్యాచర్ వచ్చిన వడ్లను చూపిస్తున్న ముద్దాయిపేట రైతులు

పుల్కల్, మే 10: ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండలంలోని ముద్దాయిపేట గ్రామ రైతులు కోరుతున్నారు. వడ్లు ఆరబోసి 25 రోజులైనా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. ముద్దాయిపేటలో యాసంగిలో 250 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. వడ్లు ఆరబోయగా మ్యాచర్ కూడా వచ్చిందని, రేపు, మాపు అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని 'నమస్తే తెలంగాణ'తో రైతులు వాపోయారు. గతేడాది వానకాలంలో 12 లారీల వడ్లను ఇక్కడ విక్రయించామని, ఈసారి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడం అంటే రైతులను అవమానించడమేనని రైతులు కోర్పోలు బీరయ్య, చంద్రయ్య, మాణిక్యం, సలీం ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు ఒక్కో టార్పాలిన్‌కు రూ.15చొప్పున అద్దె చెల్లించి తెచ్చి వడ్లపై కప్పి కాపాడుకుంటున్నామని, తమ వడ్లను త్వరగా కొనుగోలు చేసేలా చూడాలని కోరారు.

సింగూరు కెనాల్ కాలువలో సీసీ లైనింగ్ కోసం చదును చేస్తున్న ప్రొక్లెయినర్

సింగూరు ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కాలువ దుస్థితి

ఎక్కడి పనులు అక్కడే!

- ప్రస్తుతం పొదల తొలిగింపు, చదును పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్లు
- 49 కిలోమీటర్ల మేర సీసీ లైనింగ్ పూర్తికి ఏడాది పైనే సమయం పట్టే అవకాశం
- ఆయకట్టుకు సాగునీరందడం కష్టమే..
- ఇప్పటికే రెండు పంటలు కోల్పోయిన ఆయకట్టు రైతులు
- ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతుల విజ్ఞప్తి

నత్తనడకన సింగూరు ఎడమ కాలువ, బ్రాంచ్ కెనాల్స్ ఆధునీకరణ పనులు

పుల్కల్, మే 10: సంగారెడ్డి జిల్లాలో సింగూరు ఎడమ కాలువ, బ్రాంచ్ కెనాల్స్ ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మొత్తం 49 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంటుంది. కానీ, కాలువల్లో నెలల తరబడి పొదల తొలిగింపు, చదును పనులతోనే కాంట్రాక్టర్లు సరిపెడుతున్నారు. సీసీ లైనింగ్ కాలువ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభించనేలేదు. దీంతో ఈసారి ఆయకట్టుకు సాగునీరందడం కష్టమేనా అంటూ రైతులు నిట్టూరుస్తున్నారు. ఇప్పటికే ఆయకట్టు రైతులు రెండు పంటలు కోల్పోయారు. వర్షాకాలం సమీపిస్తున్నా పనుల్లో పురోగతి కరువైంది.

సింగూరు కాలువలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

రూ.175 కోట్లతో పనులు...

సింగూరు వరద కాలువ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.175 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో సింగూరు ఎడమ కాలువతో పాటు బ్రాంచ్ కెనాల్స్ ఆధునీకరణ పనులు చేపడతారు. గడిచిన యాసంగిలోనూ మరమ్మతుల పేరిట సింగూరు ప్రాజెక్టు నుంచి నీళ్లు వదలక పోవడంతో వరద కాలువల కింద 32,250 ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేయలేక పోయారు. మరో 10వేల ఎకరాల్లో బోర్ల కింద రైతులు పంటలు వేశారు. కానీ, భూగర్భ జలాలు అడుగంటి బోర్ల నుంచి నీళ్లు రాక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారు. సింగూరు ప్రధాన కాలువ అయిన మోడల్ స్కూల్ నుంచి బస్వాపూర్ మధ్యన ప్రస్తుతం సీసీ లైనింగ్ కోసం లెవలింగ్ పనులు చేస్తున్నారు. పరిస్థితులను చూస్తుంటే ఈ వర్షాకాలంలో కూడా సింగూరు కాలువ పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. యుద్ధప్రాతిపదికన పనులు చేపడితే కనీసం వర్షాకాలం నాటికైనా 15వేల ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంటుంది. సింగూరు ప్రధాన కాలువకు దగ్గరలో ఉన్న ముద్దాయిపేట, పోచారం, పుల్కల్, బస్వాపూర్, ముదిమాణిక్యం గ్రామాలకు సాగునీరందించే అవకాశం ఉంటుంది. పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోయినా కనీసం కొన్ని గ్రామాలకు వర్షాకాలంలో పంటలకు సాగు నీరందిస్తే రైతులు నష్టపోకుండా ఉంటారు.

ముంచుకొస్తున్న వానకాలం..

మరో నెల రోజుల్లో వానకాలం రానున్నది. ఈనెల 20 నుంచే ఈదురు గాలుల తో పాటు వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో సింగూరు ప్రధాన కాలువ సీసీ లైనింగ్ పనులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. సింగూరు ప్రధాన కాలువకు రెండువైపులా మట్టి, రోడ్డుపై మట్టి ఉండటంతో కాంక్రీట్ తీసుకెళ్లే బండ్లు, మరే ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండదు. జూన్ 12 మృగశిర కార్తె తర్వాత భారీ వర్షాలు పడే అవకాశాలు ఉంటాయి. వర్షాలు కురిస్తే పనులకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుంది.

రైతులకు పరిహారం చెల్లించాలి..

సింగూరు ప్రాజెక్టు నుంచి రెండు పంటలకు సాగునీరు అందించక పోవడంతో రైతులు నష్టపోయారు. రైతులతో పాటు కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. వర్షాకాలంలో రైతులకు సాగునీరు ఇవ్వని పక్షంలో రైతు భరోసా తరహాలో ఒక పంటకు కనీసం రూ.15 వేల చొప్పున పరిహారం చెల్లించాలి. కౌలుకు భూములు తీసుకున్న వాళ్లు తీవ్రంగా నష్ట పోయారు. బోర్ల కింద సాగుచేసిన రైతులు సైతం భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయి నష్టపోయారు.
– చంటి క్రాంతికిరణ్, అందోల్ మాజీ ఎమ్మెల్యే

దేశం కోసం ప్రాణాలను లెక్క చేయలే..

కార్గిల్ యుద్ధంలో బుల్లెట్ గాయమైంది: రిటైర్డ్ సైనికుడు సిద్దిపేట ఎల్లం

చేగుంట, మే 10: మెదక్ జిల్లా నిజాంపేట మండలం తిప్పన్నగుల్లకు చెందిన రిటైర్డ్ సైనికుడు సిద్దిపేట ఎల్లం దేశం కోసం ప్రాణాలను లెక్క చేయలేదు. ఆయన కార్గిల్ యుద్ధంలో పాల్గొని ఎడమ కాలికి బుల్లెట్ దిగడంతో గాయపడ్డారు. 1997 నుంచి 2017 వరకు ఆర్మీలో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం మెదక్ జిల్లా చేగుంట మండలంలో ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఎల్లం ప్రస్తుతం చేగుంటలో నివసిస్తున్నారు. తిప్పనగుల్లకు చెందిన సిద్దిపేట రాజమ్మ–రాజయ్యల రెండో సంతానమైన ఎల్లం, చిన్నతనం నుంచి ఆర్మీలో చేరి దేశసేవ చేయాలనే సంకల్పం ఉండేది.1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు నార్లపూర్‌లో, 7నుంచి 10 వరకు నిజాంపేట ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ రెండో సంవత్సరం వరకు రామాయంపేట ప్రభుత్వ కళాశాలలో చదివారు. ఇంటర్ చదివే సమయంలో సిపాయిగా భారత ఆర్మీలో చేరి హైదరాబాద్ గోల్కొండలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఆ తరువాత 1998 నుంచి 2001 వరకు జమ్ముకశ్మీర్‌లోని నవ్‌గావ్ సెక్టార్‌లో పనిచేశారు.1998 డిసెంబర్‌లో కార్గిల్ యుద్ధం సమయంలో సిపాయిగా పనిచేశారు. ఆ యుద్ధంలో ఆయన ఎడమ కాలికి బుల్లెట్ గాయమైంది. 2003 నుంచి 2006 వరకు జమ్ముకశ్మీర్‌లోని రాజోరి సెక్టార్‌లో, 2006 నుంచి 2009 వరకు పంజాబ్‌లోని పఠాన్‌పూర్‌లో, 2009 నుంచి 2011 వరకు జమ్ముకశ్మీర్‌లోని కార్గిల్ సెక్టార్‌లో, 2011నుంచి 2013 మహారాష్ట్రలోని నాసిక్‌లో జవాన్లకు గన్నుల తోప్‌కాన్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 2013 నుంచి 2017 వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా బార్డర్‌లో పనిచేశారు. 2017లో రిటైర్డ్ అయినట్లు ఎల్లం తెలిపారు.

యుద్ధానికి ఇప్పుడూ రెడీ..

యుద్ధానికి రమ్మంటే ఇప్పుడైనా పాల్గొంటా. దేశ రక్షణే నాకు ముఖ్యం. శత్రు దేశమైన పాకిస్థాన్‌ను ఎలా ఎదుర్కొవాలే భారత సైన్యానికి బాగా తెలుసు. ఉగ్రవాదులను మొదటి నుంచి పెంచి పోషిస్తున్నది పాక్. పాక్‌లో ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి మన దేశంలోకి పంపుతారు. మన సరిహద్దుల చుట్టూ కంచె ఉంటుంది. కొన్ని చోట్ల గుట్టలుగా ఉన్న చోటునుంచి జమ్ముకశ్మీర్ వంటి ప్రాంతాల నుంచి ఉగ్రమూకలు చొరబడతాయి.
–సిదిపేట ఎల్లం, మాజీ సైనికుడు

యుద్ధం వస్తే అప్రమత్తంగా ఉండాలి..

జిన్నారం, మే 10: నేను పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో విధులు నిర్వహించాను. 1992లో మిలటరీలో చేరాను. 2003 నుంచి దాదాపు మూడేండ్ల పాటు కార్గిల్ సరిహద్దుల్లో విధులు నిర్వహించాను. ఆపై ఫిరంగి దళంలో 16 ఏండ్లు పనిచేసే 2008లో సైనికుడిగా ఉద్యోగ విరమణ పొందాను. పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో పీస్ ఫైరింగ్ నిరంతరం జరుగుతూనే ఉంటుంది. అక్కడ హై అలర్ట్ ఉంటూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. పాక్, చైనా సరిహద్దుల్లో ఒకవేళ యుద్ధం మొదలైతే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. త్రివిధ దళాలు దేశ రక్షణకు పాటుపడతాయి. ఒకవేళ పూర్తి స్థాయి యుద్ధం వస్తే పెట్రోల్ బంకుల వంటి ప్రదేశాల్లో ఉండవద్దు. ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్‌ను ఆఫ్ చేసుకోవాలి. ఉపగ్రహ చిత్రాల ద్వారా దాడులు చేసే అవకాశాలు ఉన్నందున గుంపులుగా బయట తిరగవద్దు. 24 గంటలు అప్రమత్తంగా ఉండి ఎప్పుడు ఏమి జరిగినా ప్రభుత్వ ఆదేశాల మేరకు దానిని ఎదుర్కొనేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలి. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో హెచ్ఆర్‌గా పనిచేస్తున్నా.
– శంకర్ ప్రసాద్, మాజీ సైనికుడు

కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న..

జహీరాబాద్, మే 10: మాకు 60 ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉండేది. ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చిన్నప్పటి నుంచే దేశసేవ చేయాలనే ఉద్దేశంతో ఆర్మీలో చేరారు. 1995 నుంచి 2019 వరకు భారత ఆర్మీలో వివిధ ప్రాంతాల్లో పనిచేశాను. ఏసీపీ నాయక్ సుబేదారు ర్యాంకు హోదాలో రిటైర్డు అయ్యాను. నేను ఆర్మీలో చేరిన కొత్తలో 1996లో కార్గిల్ యుద్ధం జరిగింది. అప్పుడు కశ్మీర్ ప్రాంతంలోని కుప్వారా సెక్టార్‌లో విధులు నిర్వహించాను. ఆ యుద్ధంలో భారత్ విజయం సాధించింది. ఆ తర్వాత ఏడాది పాటు రాజస్థాన్ సరిహద్దుల్లో విధులు నిర్వహించి పాకిస్థాన్ దాడులను తట్టుకున్నాను. ఆ తర్వాత వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యాను. పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం చాలా బాధాకారం. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేసేందుకు భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ మనందరికీ గర్వకారణం. త్రివిధ దళాలకు అందరం మద్దతుగా నిలవాలి.
– దేవరాజ్, ఏసీపీ నాయక్ సుబేదార్ రిటైర్డ్, ధనసరి గ్రామం, మొగుడంపల్లి మండలం (సంగారెడ్డి జిల్లా)

దేశసేవలో గిరిజన బిడ్డలు

బానోత్ నర్సింగ్

కోహీర్, మే 10: దేశ రక్షణలో ఆ తండాబిడ్డలు ముందున్నారు. దేశ సరిహద్దులో తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని సేడియగుట్ట తండాకు చెందిన బానోత్ నర్సింగ్ సైనికుడిగా సేవలందిస్తున్నారు. గమని బాయి దేవాలనాయక్ మూడో కుమారుడు బానోత్ నర్సింగ్ సీఆర్పీఎఫ్ సీఐగా రానాక్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అతడి రెండో సోదరుడు బానోత్ దశరథ్ 32 ఏండ్ల పాటు దేశ రక్షణకు పాటుపడ్డారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. హైదరాబాద్‌లోని డీఆర్డీఏ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. తండాకు చెందిన మరో గిరిజనుడు బానోత్ సురేశ్ కూడా ఆర్మీలో పని చేసి రిటైర్డ్ అయ్యారు. అన్న దశరథ్ రిటైర్డ్ అయినప్పటికీ తమ్ముడు నర్సింగ్ మాత్రం జమ్ములో పనిచేస్తున్నారు. కాగా సేడియ గుట్ట తండాకు చెందిన మరో ఇద్దరు కూడా సైనికులుగా దేశ రక్షణలో భాగస్వాములయ్యారు. బానోత్ హీరాలాల్, చవాన్ సుభాశ్ దేశ సేవకు అంకితమయ్యారు. తమ తండా నుంచి దేశానికి సేవలందిస్తుండడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూరు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.